క్లుప్తంగా

షిరిడీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయంలో గురువారం షిరిడీ సాయిబాబా జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు ఉగ్రదండి శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం గజ్జల కోటేశ్వర్‌రావు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాచకొండ రామకోటేశ్వర్‌రావు, భక్తులు తదితరులున్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

మునగాల : మండలంలోని విజయరాఘవపురం గ్రామానికి చెందిన గ్రామీణ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కంకణాల మధు గ్రామంలోని నిరుపేదలు, దివ్యాంగులకు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. 2023–24 విద్యా సంవత్సరంలో గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థులు మొదటి ర్యాంకు సాధిస్తే వారికి రూ.10వేల ఆర్థికసాయం అందిస్తానని అన్నారు.

రుణమాఫీ వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతప్రకాష్

పాలకవీడు : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి అనంతప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు లక్షలోపు రుణమాఫీ చేసినట్లు కేసీఆర్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణలో శూన్యమన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో వెయ్యి మంది రైతులు రుణమాఫీకి అర్హులు కాగా కేవలం 374మందికి మాత్రమే రుణమాఫీ వర్తించిందన్నారు. ప్రభుత్వం మాటలకు చేతలకు ఇదే నిదర్శనమన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు మట్టేష్, వెంకట్‌రెడ్డి, శేషగిరిరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనంతపద్మనాభ వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు


హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహా లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో అనంత పద్మనాభ చతుర్థి కార్యక్రమంలో భాగంగా అనంత పద్మనాభ స్వామి వ్రతాన్ని గురువారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభలను జయప్రదం చేయాలి

పాలకవీడు : నేరేడుచర్ల మండల కేంద్రంలో అక్టోబర్ 3న నిర్వహించే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సభకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు సింహాద్రి, మట్టారెడ్డి, శివ, వినోద్, రాంప్రసాద్, నాగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ఉద్యమించాలి

చిలుకూరు : నేటి యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ భవన్‌లో భగత్‌సింగ్ 116 జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలమయ్యాయని అన్నారు. వచ్చే నెల 3న నేరేడుచర్ల జరిగే జిల్లా మహాసభలకు యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అనంతుల రాము, నాయకులు షేక్ మౌలానా, శ్రీకాంత్, మాధవరపు లక్ష్మయ్య, సాగి శేఖర్, నిజాముద్దీన్, వినోద్, రఫీ, సాయికుమార్, అశోక్‌కుమార్, ధర్మయ్య పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లులు.. నిలిచిన పనులు

- బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.62కోట్లకు ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్
- సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిపివేత
- వర్షానికి డైవర్షన్ రోడ్డు కుంగడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పనులు పూర్తిచేయాలని గ్రామస్తుల డిమాండ్



మధ్యలోనే నిలిచిన తాడువాయి శివారులోని గురప్పవాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు



డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో తాత్కాలికంగా గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న వంతెన

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామపంచాయతీ శివారులో గల గురప్పవాగుపై రూ.2.62కోట్ల వ్యయంతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణ పనులు నెల రోజులుగా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్పవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఆన్‌లైన్‌లో టెండర్ దక్కించుకున్న ఓ కాంట్రాక్టర్ గత ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాడు. ఆ కాంట్రాక్టర్ పనులు చేపట్టి స్లాబ్‌లెవల్ వరకు పూర్తి చేశారు. కాగా మిగతా పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో చేసేది లేక నెల రోజుల క్రితం పనులు నిలిపివేశాడు. నిధులు విడుదల తర్వాతనే పనులు ప్రారంభిస్తానని కాంట్రాక్టర్ తేల్చి చెప్పడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా బ్రిడ్జి నిర్మాణపు పనులు కొనసాగుతున్న సమయంలో కాంట్రాక్టర్ గ్రామప్రజల రాకపోకల కోసం తాత్కాలికంగా ఓ డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఆ రోడ్డు నెల రోజుల క్రితం భారీ వర్షాలు కురవడం, ఎగువన ఉన్న మాధవరం, మొద్దులచెరువు, ఎర్రచెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో గురప్పవాగుకు ఉధృతి ఎక్కువై ఆ వరదకు డైవర్షన్ రోడ్డు తెగిపోయింది.

రాకపోకలకు ఇబ్బందులు..

వర్షానికి డైవర్షన్ కోతకు గురికావడంతో తాడువాయి గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో వారం రోజుల పాటు గ్రామప్రజలు మండల కేంద్రానికి చేరుకోవాలంటే 20కి.మీ చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి డైవర్షన్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. తిరిగి మూడు రోజులుగా వరద ఎక్కువ కావడంతో మళ్లీ డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. పరిసర ప్రాంతాలకు చెందిన రైతులు తమ పొలాల వద్దకు వెళ్లేందుకు రోడ్డు తెగిన ప్రాంతంలో తాత్కాలికంగా కట్టెలతో వంతెన ఏర్పాటు చేసుకొని ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తుందని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డు నుంచి ఎక్కువ సంఖ్యలో మండల కేంద్రానికి వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీలైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



గ్రామశివారులో గురప్పవాగుపై నిర్మించే బ్రిడ్జి నిర్మాణపు పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి. ఇందుకోసం ప్రభుత్వం నిధులు యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలి. ప్రస్తుతం డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో గ్రామంలోకి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది.

– కోల ఆంజనేయులు, తాడువాయి

రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం



గురప్పవాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పనుల వల్ల ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తెగిపోవడంతో మూడు రోజులుగా గ్రామంలోకి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. వరద ఉధ్రుతి ఎక్కువైతే 20కి.మీ. చుట్టూ తిరిగి మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుంది. మా పొలాల వద్దకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

– జిల్లేపల్లి చినమంగయ్య, తాడువాయి

మూడు నెలలో పూర్తిచేస్తాం

మండలంలోని తాడువాయి శివారులో గురప్పవాగుపై రూ.2.62కోట్ల వ్యయంతో నిర్మించే బ్రిడ్జి నిర్మాణపు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయి. సకాలంలో కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో పనులను నిలిపివేశాడు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించి మూడు నెలల్లో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తాం.

– పవన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ

పట్టణాన్ని పారిశుద్ధ్యంలో అగ్రస్థానంలో నిలపాలి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



హుజూర్‌నగర్ : కాలనీలో చెత్త ఎత్తుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణాన్ని పారిశుద్ధ్యంలో అగ్రస్థానంలో నిలపాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఇండియన్ స్వచ్ఛత 2.0 స్వచ్ఛత హీ సేవలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో స్వచ్ఛత లీగ్‌లో పాల్గొని వీధిలోని చెత్తను ఎత్తి శుభ్రం చేసి అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పట్టణంలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సహకారంతోనే పారిశుద్ధ్యంలో మెరుగుదల ఉంటుందని దానితోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ హుజూర్‌నగర్‌కు కేటాయించిన రూ.25కోట్లకు సంబంధించిన జీఓను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, కౌన్సిలర్లు ఉపేంద్ర సైదులు, మంగమ్మ, గురవయ్య, హరిబాబు, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్, నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, అమర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు కేసీఆర్ : ఎమ్మెల్యే సైదిరెడ్డి

మెప్మా ఆర్పీల కష్టాలను గుర్తించిన మహనీయుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆర్పీల వేతనం పెంపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత..

మఠంపల్లి మండలంలోని కామంచికుంట తండాలో ఇటీవల మృతి చెందిన చంటి భార్య సంధ్యకు ఎమ్మెల్యే ఉద్యోగ నియామకపత్రం అందజేశారు. అనంతరం పీఆర్‌టీయూ భవన్ నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యేను యూనియన్ సభ్యులు శాలువాతో సన్మానించారు.

అభివృద్ధి వైపు ప్రజలు పయనిస్తున్నారు : ఎమ్మెల్యే

సంక్షేమం, అభివృద్ధి వైపు ప్రజలు పయనిస్తున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం మేళ్లచెరువు మండలం వేపలమాధారం గ్రామానికి చెందిన పలువురు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండల్‌రావు, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాసరావు, సోమ్లానాయక్, గుర్వారెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు మంజూరు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో పీఆర్‌టీయూ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి రూ.5లక్షల నిధులను మంజూరు చేయించారు. అందుకు తగిన నిధుల మంజూరు పత్రాన్ని హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పీఆర్‌టీయూ నాయకులకు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమావత్ దీప్లానాయక్, నాయకులు సైదులు, సత్యనారాయణరెడ్డి, రవి, శ్రీధర్, శంకర్, కృష్ణయ్య, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నేరేడుచర్ల పట్టణ ఇన్‌చార్జ్ కొణతం సత్యనారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ యామిని వీరయ్య, నాయకులు సైదులు, రమేష్‌బాబు ఉన్నారు.



నేరేడుచర్ల : భవన నిర్మాణానికి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గుర్రం జాషువా స్ఫూర్తితో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న కవి కేవీ సత్యనారాయణ

హుజూర్‌నగర్ : నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా స్ఫూర్తితో ముందుకెళ్లాలని కవి కేవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జాషువా నగర్‌లో గురువారం గుర్రం జాషువా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కౌన్సిలర్ కస్తాల శ్రవణ్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో ఆత్మగౌరవ బావుటా గుర్రం జాషువా అని కొనియాడారు. కులాలకు మతాలకు అతీతంగా మానవ జాతి కల్యాణం అభిలశించిన వ్యక్తి, విశ్వనరుడు అని అభివర్ణించారు. సమాజంలో కలవిపక్షతను జాషువా తన గబ్బిలం నవల ద్వారా విమర్శించారని అన్నారు. జాషువా స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారంలో ముందుండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాతంగి ప్రభాకర్, గల్లా వెంకటేశ్వర్లు, బి.రామారావు, సీహెచ్.నాగయ్య, ఆర్.ముత్తయ్య, బి.రవీందర్, ఐ.అంబేద్కర్, ఎస్.సైదులు, బి.హుస్సేన్, శ్రీదేవి, కిరణ్, రవి, జనార్దన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు

కోదాడ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వమని జమాతే ఇస్లామీ హింద్ సభ్యులు అన్నారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి, శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల పాఠశాలలో పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోదాడ జమాతే ఇస్లామీ హింద్ అధ్యక్షుడు ఖాజామియా, బడుగుల సైదులు, హమీద్ మౌలానా, అయ్యూబ్ మౌలానా, అతర్ మౌలానా, షఫీ, అబ్దుల్ గఫార్, సుభాని, జబ్బార్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం..

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించే మిలాద్–ఉన్–నబీ పర్వదినం సందర్భంగా పట్టణంలోని ప్రతిభ బ్లూమ్స్ పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మానవత్వాన్ని చాటిన మహనీయుడు మహ్మద్ ప్రవక్త అన్ని అన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి వచ్చిన యువకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సూర్యాపేట రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, ఎంఈఓ సలీంషరీఫ్, కౌన్సిలర్ షఫీ, పాఠశాల కరస్పాండెంట్ షేర్ అలీ, మౌలానా అబ్దుల్ ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి



ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

చిలుకూరు : ప్రభుత్వం ఆశావర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ముత్యాలు డిమాండ్ చేశారు. ఆశవర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశాలకు పనికి తగిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్లు డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు సుశీల, నాగమణి, లింగమ్మ, పద్మ, సునీత, శైలజ, కలిద, సుహాసిని, మున్ని తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అదనపు జడ్జి పూజలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో మిర్యాలగూడ 5వ అదనపు జడ్జి కె.కవిత గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను అర్చకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కొండారెడ్డి, అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ పోలీస్, సిబ్బంది తదితరులున్నారు.

విద్యుత్ కోతలు నివారించాలని రాస్తారోకో



రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

మఠంపల్లి : వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా అందించాలని గురువారం మండలంలోని బక్కమంతులగూడెం, త్రివేణినగర్, ఎర్రగట్టు గ్రామాలకు చెందిన రైతులు మట్టపల్లి–హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. దీంతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు ఎండుతున్నాయని, 24గంటలు విద్యుత్ ఇస్తున్నామని చెబుతూ కనీసం 10గంటలు కూడా ఇవ్వడం లేదని, అది కూడా పలుమార్లు కోతలు విధిస్తుండడంతో పంటలకు సరిపడా నీరు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో మండల విద్యుత్ ఏఈ హరీష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరా సక్రమంగా అందిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణనాథుల నిమజ్జనం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో శ్రీమణికంఠ యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలను గురువారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాల అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని సర్పంచ్ షేక్ సలీమారంజాన్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలు శోభాయమానంగా సాగుతున్నాయి. గురువారం మండలంలోని అనంతగిరి, లకారం, శాంతినగర్, అమీనాబాద్, గోల్‌తండా, త్రిపురవరం, చనుపల్లి, గొండ్రియాల గ్రామాల్లో గణేశ్ నిమజ్జన యాత్ర సాగింది. ఆయా గ్రామాల్లో అన్నదానాలు, కోలాట నృత్యాలతో ఊరేగింపులు నిర్వహించారు. శాంతినగర్‌లో కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బుర్ర సుధారాణి పుల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీవీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర పుల్లారెడ్డి, నాయకులు కత్రం నాగేందర్‌రెడ్డి, బాదె రమేష్, ముత్తినేని కోటేశ్వరావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, రాజు, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మోతె : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సర్వారంలో ఓ విగ్రహం వద్ద రూ.51,116వేలకు లడ్డూను వేలంలో ఉప్పల చంద్రబాబు దక్కించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శీలం సైదులు, ఏలూరి వెంకటేశ్వరరావు, మిక్కిలినేని సతీష్‌బాబు, పల్సు మల్సూర్, భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. నిమజ్జనానికి వాడపల్లి, మట్టపల్లికి తరలివెళ్లారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



మఠంపల్లిలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెలే సైదిరెడ్డి

మఠంపల్లి : మండలంలో గణేశ్ ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. మండల కేంద్రంలో పలు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాల వద్ద ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మట్టపల్లి వద్ద కృష్ణానదిలో గణేశ్ విగ్రహాల నిమజ్జనాలను పోలీసు, కార్యదర్శులు, సిబ్బంది ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుల వద్ద లడ్డూ వేలం గురువారం పోటాపోటీగా సాగాయి. మండల కేంద్రంలోని జాన్‌పహాడ్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద లడ్డూ వేలం రికార్డు స్థాయిలో రూ.లక్ష 31వెయి116లకు రాచకొండ నాగేందర్ కైవసం చేసుకున్నారు. అదే విధంగా రాఘవేంద్రకాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద పోలిశెట్టి వినయ్‌కుమార్, యాదా సందీప్ రూ.52వేల 200లకు లడ్డూ కై వసం చేసుకున్నారు. వెంకటసాయి అపార్ట్‌మెంట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ వేలంలో మేకపోతుల అరవింద్ గౌడ్ రూ.21వేలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేశ్ శోభాయాత్రను నిర్వహించారు.

రూ.30 వేలు పలికిన వినాయకుడి లడ్డూ ధర

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల ఎస్సీ కాలనీలో గణేశ్‌డి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలం పాటలో అదే గ్రామానికి చెందిన చింత నగేష్, సైదమ్మ దంపతులు రూ.30 వేలకు లడ్డూని కైవసం చేసుకున్నారు.

బృందావనపురంలో అన్నదానం

గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం మండల పరిధిలోని బృందావనపురంలో శ్రీరామాలయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నడిగూడెం సహకార సంఘం చైర్మన్ పుట్టా రమేష్, ఎంపీటీసీ గోలి సునీత, తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌రూరల్ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



నేరేడుచర్లలో వినాయకుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



అనంతగిరి : శాంతినగర్‌లో అన్నదానంలో పాల్గొన్న బుర్ర సుధారాణి పుల్లారెడ్డి



మఠంపల్లి : మట్టపల్లి వద్ద కృష్ణానదిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు



గరిడేపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు



నడిగూడెం : బృందావనపురంలో అన్నదానం చేస్తున్న భక్తులు

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కోదాడ : పట్టణంలోని రాయల్ ఎన్‌క్లేవ్‌లో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను చేపట్టడంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. కొద్ది రోజుల్లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కోదాడను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వంగవేటి రామారావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, కందుల కోటేశ్వరరావు, కోళ్ల కోటిరెడ్డి, లంకెల నిరంజన్‌రెడ్డి, గంధం యాదగిరి, షాబుద్దీన్, కర్రి సుబ్బారావు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న సొసైటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన గొట్టిపర్తి వెంకయ్య ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. దీంతో గురువారం ఆయన కుటుంబానికి శాలివాహన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సిరికొండ అంతయ్య మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి శాలివాహన కులస్తులకు ఆర్థిక చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, కులపెద్దలు ఉన్నారు.

చిలుకూరు : మోతె మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన శాంగటి నాని అనారోగ్యంతో బాధపడుతుండడంతో చిలుకూరుకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు, కోదాడ మెగా బ్లడ్ డొనేషన్ ట్రస్టు వ్యవస్థాపకుడు కస్తూరి సురేష్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో సోషల్ మీడియా వేదికగా పలువురు నానికి రూ.25వేల ఆర్థికసాయం అందజేసినట్లు సురేష్ గురువారం విలేకరులకు తెలిపారు.

బీజేపీకి కార్యకర్తలే బలం

గరిడేపల్లి : బీజేపీకి బలం పార్టీ కార్యకర్తలేనని ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన బూత్ ప్రవాస్ యోజన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ అధ్యక్షులు ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు సీఎం కేసీఆర్ రంగులు మార్చి తామే పథకాలను అమలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు పోకల వెంకటేశ్వర్లు, ఆర్టీఏ సెల్ జిల్లా కన్వీనర్ రవికుమార్, ఓబీసీ మోర్చ ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జనగల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కుక్కడపు వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య